కోడుమూరులో 'నాన్ లోకల్' చిచ్చు




కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలో సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైసీపీ నాయకులు

కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం ఇన్‌చార్జిగా ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేశ్ తమ్ముడు డాక్టరు ఆదిమూలపు సతీశ్‌ను సీఎం జగన్ ఎంపిక చేయడంపై ఆ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. అధిష్టానం నిర్ణయాన్ని మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మూడో జాబితా వచ్చిన వెంటనే మురళీకృష్ణ అభిమానులు, పలువురు వైసీపీ కార్యకర్తలు గురువారం రాత్రి ఆయన ఇంటి వద్దకు చేరుకొని సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్నూలులోని వెంకటరమణ కాలనీ ప్రధాన రహదారిపై సీఎం జగన్ ఫ్లెక్సీలను దహనం చేశారు. శుక్రవారం ఉదయం కూడా నియోజకవర్గం నలుమూల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు ఆయన ఇంటికి చేరుకున్నారు. జగన్ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. నాన్ లోకల్‌కు చెందిన సతీశ్‌కు టికెట్ ఎలా ఇస్తారు..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు చివరి వరకు తనకే టికెట్ వస్తుందని ధీమాగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కార్యకర్తలకు అందుబాటులోకి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

ధిక్కార స్వరం..!

- అభ్యర్థిగా ఎంపిక చేసినంత మాత్రాన బీ-ఫారం ఇచ్చినట్లు కాదు
- రెండు నెలల్లో ఏమైనా జరగవచ్చు
- మంత్రి గుమ్మనూరు జయరాం
- ఎమ్మిగనూరులోనూ అభ్యర్థిని మార్చాలని తేల్చిచెప్పిన కార్యకర్తలు
- సీన్‌కు దూరంగా రుద్రగౌడ్, బుట్టా
- కోడుమూరులో మురళీకృష్ణ ఆగ్రహం.. సీఎం ఫ్లెక్సీలు దహనం
- జిల్లా వైసీపీలో తారాస్థాయికి చేరిన అంతర్గత సంక్షోభం

అనుచరులు, కార్యకర్తలు ఎంపీగా వద్దంటే ముఖ్యమంత్రి జగన్ నిర్ణయాన్ని సైతం ధిక్కరించి ఆలూరు నుంచే పోటీ చేసేందుకు తాను సిద్ధమని పరోక్షంగా అధిష్టానానికి మంత్రి జయరాం అల్టిమేటం జారీ చేశారా? ఆలూరు వదిలిపెట్టేందుకు ఆయన ఏమాత్రం సుముఖంగా లేరా? అసలు విరూపాక్షికి టికెట్ ప్రకటించడంపై ఆయనతో పాటు అనుచరులూ ఆగ్రహంతో రగిలిపోతున్నారా? వీటన్నింటికి తాజా పరిణామాలు అవుననే సమాధానమిస్తున్నాయి. కర్నూలు జిల్లా సీట్లాటలో వైసీపీ నేతలు గందరగోళానికి గురవుతున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలు ఎక్కడపడితే అక్కడ బహిరంగంగానే పార్టీ తీరుపై ధిక్కారస్వరం వినిపిస్తున్నారు.



'అభ్యర్థిని ఎంపిక చేసినంత మాత్రాన బీఫారం వచ్చినట్లు కాదు.. ఇంకా రెండు నెలల సమయం ఉంది.. ఏదైనా జరగవచ్చు.. నామినేషన్ వేశాక బీ-ఫారం మరొకరికి ఇచ్చిన రోజులూ ఉన్నాయి.. కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లమంటే వెళ్తా.. వద్దంటే దేనికైనా సిద్ధం..'
- కార్యకర్తల సమావేశంలో మంత్రి గుమ్మనూరు జయరాం

జయరాం వర్సెస్ విరూపాక్షి

కర్నూలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జిల (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు) జాబితా ప్రకటించి 24 గంటలు గడవకనే జయరాం ధిక్కార స్వరం వినిపించడం చర్చనీయాంశంగా మారింది. అధిష్టానం ప్రకటించిన ఆలూరు అభ్యర్థి విరూపాక్షి ఎంపికపై మంత్రి వర్గం వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. కార్యకర్తలు ఆమోదిస్తేనే ఢిల్లీకి వెళ్తా.. లేదంటే దేనికైనా సరే అంటూ పేర్కొన్నారంటే రెబల్ అభ్యర్థిగానైనా పోటీ తాను సిద్ధం అని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారని, ఎంపీగా పోటీకి అనాసక్తి చూపుతున్నారని విశ్లేకులు అంటున్నారు. ఎమ్మిగనూరులో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ప్రతిపాదన మేరకే మాచాని వెంకటేశ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఈయన అభ్యర్థిత్వాన్ని మెజార్టీ వైసీపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. అక్కడి నుంచి టికెట్ ఆశించిన ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్, బుట్టా రేణుకలు సైలెంట్ అయ్యారు. కోడుమూరు (ఎస్సీ) టికెట్ తమకే వస్తుందని చివరి వరకు ధీమాగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణలను కాదని విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌కు ఇవ్వడంపై ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తాజా సంఘటనలో వైసీపీలో అంతర్గత సంక్షోభం ముదిరిందని పలువురు పేర్కొంటున్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి జయరాం

ఆలూరు వైసీపీ ఇన్‌చార్జి (అభ్యర్థి)గా బూసినే విరూపాక్షి ఎంపిక మంత్రి జయరాం వర్గీయులకు మింగుడుపడటం లేదు. మంత్రి జయరాం కూడా అధిష్టానం నిర్ణయంపై పరోక్షంగా వ్యతిరేకత వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఆలూరులో మంత్రి జయరాం స్వగృహం వేదికగా చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులు చూస్తే జయరాం ఎంపీగా పోటీ చేసేందుకు అనాసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభీష్టం పేరుతో ఆలూరు నుంచే రెబల్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సై అంటున్నట్లు తెలుస్తోంది. నామినేషన్ వేసిన తరువాత కూడా బీ-ఫారం మరొకరికి ఇచ్చిన సంఘటనలు ఉన్నాయని, రెండు నెలలు సమయం ఉంది. ఏదైనా జరగవచ్చని మంత్రి పేర్కొనడం చూస్తే విరూపాక్షికి బీ-ఫారం దక్కకుండా చివరి వరకూ ప్రయత్నాలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్ ముందు బలప్రదర్శనకు కూడా సిద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. నియోజకర్గం కార్యకర్తలు, మంత్రి జయరాం అనుచరులను సమీకరించి 'చలో విజయవాడ' చేపడుతామని మంత్రి ఇంటి వద్దే ఆయన అనుచరులు పేర్కొనడం కొసమెరుపు. మంత్రి జయరాం, జడ్పీటీసీ విరూపాక్షిల మధ్య వర్గవిభేదాలు వైసీపీలో అంతర్గత సంక్షోభానికి దారి తీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విరూపాక్షి బీ-ఫారం సాధించి ఎన్నికల్లో పోటీ చేసినా మంత్రి జయరాం వర్గీయులు సహకరిస్తారా..? అన్న ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. అయితే ఇది ముందే పసిగట్టిన జడ్పీటీసీ విరుపాక్షి జయరాం వర్గీయులు సహకరించినా.. సహకరించకపోయినా రాబోయే ఎన్నికల్లో బరిలో తన సత్తా ఏంటో చూపిస్తానంటూ దూకుడుగా ముందుకెళ్తున్నాడు.

ఎమ్మిగనూరులోనూ వ్యతిరేకత

సీఎం జగన్ ప్రకటించిన రెండో జాబితాలో ఎమ్మిగనూరు అభ్యర్థిగా మాచాని వెంకటేశ్‌ను ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తనకు లేదా తన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికు టికెట్ ఇవ్వాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఇదే క్రమంలో అక్కడ టికెట్ కోసం మాజీ ఎంపీ బుట్టా రేణుక, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రగౌడ్ విశ్వప్రయత్నాలుచేశారు. అయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన అనుచరుడైన మాచాని వెంకటేశ్‌ను తెరపైకి తీసుకొచ్చాడు. దీంతో అధిష్టానం కూడా ఆయనకే టికెట్ ఖరారుచేస్తూ జాబితాను విడుదల చేసింది. ఎమ్మిగనూరు టికెట్ ఆశించిన భంగపడిన ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక ఎర్రకోట నిర్ణయంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 1994, 2014, 2019 మూడు సార్లు ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎర్రకోట, ఆయన కొడుకు గెలుపు కోసం కష్టపడితే ఆయన ఇచ్చిన గిఫ్ట్ ఇదా..? మాచాని వెంకటేశ్ కంటే నేను తక్కువనా..? ఇన్నాళ్లు రాజకీయంగా కొండకు రాళ్లు మోసినట్లు అయ్యింది..? అంటూ రుద్రగౌడ్ తీవ్ర మనోవేదనకు గురైనట్లు సమాచారం. ప్రస్తుతం సైలెంట్ అయ్యారు. ఎమ్మెల్యే లేదా ఎంపీ ఒక అక అవకాశం వస్తుందని ఆశించిన బుట్టా రేణుకకు కూడా జగన్ మొండి చూపడంతో ఆమె కూడా సైలెంట్ అయ్యారు.



కలెక్టరేట్ ముట్టడి



నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

దూసుకెళ్లేందుకు యత్నించిన నాయకులు, అంగన్‌వాడీలు

అడ్డుకున్న పోలీసులు

కర్నూలు(హస్పిటల్), జనవరి 12: అంగన్‌వాడీల ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీల ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమస్యలను పరిష్కరించాలని కోరూతు వందలాదిగా అంగన్‌వాడీలు, రాజకీయ పార్టీల నాయకులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు నాయకులు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన పార్టీలు నగరంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం అంగన్‌వాడీలతో కలసి కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్యలు మాట్లాడుతూ 31 రోజుల అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళలు అని కూడా చూడకుండా అవమానాలు చేస్తూ నిర్బంధాలు ప్రయోగిస్తూ పోలీసులను ఉసిగొలుపుతూ బలవంతంగా కేంద్రాలను తెరిపిస్తున్నారని మండిపడ్డారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలనే అంగన్‌వాడీలు కోరుతున్నారన్నారు. సంక్రాంత్రిలోగా సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను బయట తిరగనివ్వమని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి అంగన్‌వాడీలు చొచ్చుకెళ్లారు. అయితే పోలీసులు భారీగా మొహరించి అడ్డుకున్నారు. ఈ క్రమలోట వామపక్షపార్టీ నాయకులు, పోలీసులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్, జనసేన నాయకులు హసీనాబేగం, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 12: స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శప్రాయమని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. శుక్రవారం రాజ్ విహార్ సెంటర్‌లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానంద విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తిని తీసుకొని దేశాభివృద్ధికి యువత పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ రమణ, మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్

సామాజిక స్పృహతో విద్యార్థులను తీర్చిదిద్దండి

సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్వీ రమణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 10: సామాజిక స్పృహతో విద్యార్థులను అన్ని రకాలుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక ధర్నా చౌక్ నుంచి భారీ ఎత్తున ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. డ్యాన్స్‌లతో, కోలాటాలతో జరిగిన ర్యాలీ ముగిశాక ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రిటైర్డు చీఫ్ జస్టిస్ రమణ మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగలేకపోయినా వామపక్ష భావజాలంతో ఉన్న ఎస్టీయూపై ఉన్న అభిమానంతో సభకు హాజరయ్యానని అన్నారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్నది మాత్రమే కాకుండా జీవితాన్ని కూడ ఉపాధ్యాయులు బోధించి అన్ని రకాలుగా విద్యార్థులను అభివృద్ధి చేయాలని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు కేవలం చదువు చెప్పే కార్ఖానాలుగా మారాయని అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ మాట్లాడుతూ సమసమాజ స్థాపనలో వామపక్ష భావజాలం వున్న ఎస్టీయూ ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. పశ్చిమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర యాప్‌ల నుంచి విముక్తి కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంఎల్ఏ హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ పోరాట పటిమ ప్రశంసనీయమని అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి



రాజ్‌విహార్ సెంటర్‌లో ర్యాలీగా వెళుతున్న ఎస్టీయూ నాయకులు

వలస పయనం



వలస వెళ్తున్న వ్యవసాయ కూలీలు

- కోతికొండ నుంచి తిరుపతికి 35 కుటుంబాలు
- సీజనల్ హాస్టళ్లు లేకపోవడంతో పిల్లాపాపలతో సహా వలస

తుగ్గలి, జనవరి 12: ఆ ఊరిని కరువు చుట్టుముట్టింది. పంటలు ఎండిపోయి, అప్పులపాలై, పూట గడవక ఊరొదిలి వలస వెళుతున్నారు. ముందస్తు వర్షాలకు రైతులు మురిసిపోయి వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలు సాగుచేశారు. ఆ తర్వాత వర్షం కురవలేదు. కళ్లముందే పంటలు ఎండిపోయాయి. అప్పులు మిగిలాయి. వ్యవసాయం దెబ్బతినడంతో మరే ఉపాధి అవకాశాలూ కనిపించలేదు. ఊళ్లో పస్తులుండటం కంటే పొట్ట చేతబట్టుకొని వలస వెళ్లడం మేలని అనుకున్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అనేక గ్రామాల్లో తుగ్గలి మండలం కోతికొండ ఒకటి. ఎద్దులదొడ్డి గ్రామ పంచాయతీ మజరా కోతికొండలో సుమారు 250 కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. వెయ్యి మంది జనాభా ఉన్న ఈ ఊరి నుంచి తాజాగా మరో 35 కుటుంబాలకు చెందిన సుమారు వంద మంది తిరుపతికి లారీలలో వలస వెళ్లారు. వర్షాలు లేక కరువుబారిన పడటంతో గ్రామంలో బతకడం కష్టమైపోయింది. పైగా అప్పులు. ఉపాధి లేని ఊళ్లో ఉండటం కంటే వలస వెళ్లి ఆకలి తీర్చుకోవడం మేలని వలస బయల్దేరారు. గిట్టుబాటుకాని ఉపాధి కూలీ పనులకంటే పరాయి ప్రాంతానికి వెళ్లి దొరికిన పని చేయడానికి వెళ్లారు. తిరుపతిలో కొండలలో గడ్డికోత పనులు ఉన్నాయని తెలియడంతో కోతికొండ గ్రామస్థులు పెట్టేబేడా సర్దుకున్నారు. పిల్లలను ఇంటివద్ద ఉంచుదామంటే ఈఏడాది సీజనల్ హాస్టళ్ల కూడా ఏర్పాటు చేయలేదు. అందువల్ల పిల్లలను కూడా తీసుకొని బయల్దేరారు. ఇంత దుర్భిక్షంతో అల్లాడిపోతున్న తుగ్గలి మండలం ప్రభుత్వ లెక్కల్లో కరువు పీడిత మండలంగా నమోదు కాలేదు.

ప్రతి ఏటా వలసలు తప్పనిసరి



మూడెకరాల పొలంలో ఈ ఏడాది కంది సాగు చేశాను. సుమారు రూ.40 వేల దాకా ఖర్చు చేశాను. వర్షాభావం వల్ల పంట ఎండిపోయింది. అప్పులు చెల్లించాలన్నా, కుటుంబాన్ని పోషించుకోవాలన్నా వలసపోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ ఏడాది పంటలు ఎక్కడా సరిగా రాకపోవడంతో తిరుపతిలో గడ్డి కోత పనులు దొరకడంతో అక్కడికి వెళ్తున్నాం.

- హుసేన్, రైతు

భోజనం పెట్టి రోజుకు రూ.600 ఇస్తారు



తిరుపతి కొండలో గడ్డికోత పనులు ఉన్నాయంటే వెళుతున్నాం. మూడుపూటలా తిండిపెట్టి రోజుకు ఒక్కొక్కరికి రూ.600 కూలీ ఇస్తామన్నారు. గతంలో పిల్లలను సీజనల్ హాస్టళ్లలో విడిచిపెట్టి వలస వెళ్లే వాళ్లం. ఈసారి గ్రామాల్లో సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు చేయకపోవడంతో పిల్లలను కూడా వెంట తీసుకెళ్తున్నాం. - కామాక్షి

ఉపాధి పని గిట్టుబాటు గాక..



వలసల నివారణ కోసమే ఉపాధి పనులు ఏర్పాటు చేశామని ప్రభుత్వం చెబుతోంది. రోజుకు రూ. 200 కూడా కూలీ గిట్టుబాటు కావడం లేదు. పైగా పని దినాలు అయిపోయాయంటారు. గ్రామంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో వలస వెళుతున్నాం. వలస వెళ్లి సంపాదించి అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. - ఆదిలక్ష్మి



సీఎం జగన్‌ను కలిసిన డా. సుధీర్ (ఫైల్)

అయ్యో ఆర్థర్

సిట్టింగ్‌కు సీటు కష్టం

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. వైసీపీ అధిష్టానం నుంచి ఎవరికి పిలుపు వస్తుందో? ఎవరికి టికెట్‌ను నిరాకరిస్తారో? అన్న ఆందోళన ఆయా నియోజకవర్గ నాయకుల్లో మొదలైంది. ఆయా నేతల ప్రజల్లో ఉన్న అసంతృప్తిని బట్టి సిటింగ్ ఎమ్మెల్యేలను మారుస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ప్రకటించిన ఇన్‌చార్జుల పేర్లను చూస్తే అర్థమవుతోంది. జిల్లాలో కూడా ఇదే ప్రాతిపదికన టికెట్లను ఇచ్చే అవకాశముందన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. అయితే నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించిన విషయంలో మాత్రం వైసీపీ ఇందుకు భిన్నంగా వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌పైన ప్రజల్లో మంచి పేరే ఉన్నా, నియోజకవర్గ ఇన్‌చార్జి బైరెడ్డి సిద్ధార్థ ప్రతిపాదించిన వారికి టికెట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తన సామాజిక వర్గం వారిని ఖుషీ చేసేందుకు జిల్లాలోని ఏకైక ఎస్సీ ఎమ్మెల్యేకు అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే ఆర్థర్ వర్గం టీడీపీ వైపు మళ్లే అవకాశం ఉందన్న అభిప్రాయం కూడా ఉంది.

పోటీపడుతున్న ఆ ఐదుగురు..
- రసకందాయంలో నందికొట్కూరు రాజకీయం
- ఓ ముగ్గురి పేర్లను ప్రతిపాదించి బైరెడ్డి సిద్ధార్థ
- తెరపైకి కడపకు చెందిన డాక్టర్ సుధీర్
- శాప్ చైర్మన్ మద్దతూ ఆయనకేనని ప్రచారం
- టీడీపీ వైపు చూస్తున్న ఆర్థర్ వర్గం?

నంద్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి)/ నందికొట్కూరు: 2019 ఎన్నికల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బైరెడ్డి సిద్ధార్థను నియమించగా, ఆర్థర్‌కు టికెట్ కేటాయించింది. ఇద్దరు సమన్వయంతో పని చేయడంతో ఆ ఎన్నికల్లో వైసీపీ తరఫున ఆర్థర్ విజయం సాధించారు. అయితే ఆ తర్వాత అసలు ఆట మొదలైంది. తన బలంతోనే ఆర్థర్ గెలిచాడం టూ సిద్ధార్థ నియోజకవర్గంలో చక్రం తిప్పడం మొదలు పెట్టారు. నందికొట్కూరులో ఏపని జరగాలన్నా తన అనుమతి ఉండాలన్నట్టుగా ప్రవర్తించడం మొదలు పెట్టారు. కనీసం చిన్న చిన్న పనులు, ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో కూడా ఆర్థర్‌కు ప్రాధాన్యం లేకుండా చేశారు. దీంతో సిద్ధార్థ వ్యవహారంపై ఎమ్మెల్యే, అతని వర్గానికి తీవ్ర ఇబ్బందిగా తయారైంది. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోగా కలిసి పని చేయాలం టూ ఆర్థర్‌కే చెప్పినట్లు ప్రచారం సాగింది. దీంతో సిద్ధార్థ మరింత దూకుడుగా వ్యవహరించాడు. మున్సిపల్, పంచా యతీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో టికెట్ల కేటాయింపు వ్యవహారంలో అధిక శాతం తన వారికే ఇవ్వాలంటూ సిద్ధార్థ పట్టుబట్టాడు. అన్ని ఇస్తే తన వర్గం వారికి అన్యాయం చేసినట్లు అవుతుందని ఆర్థర్ పార్టీ పెద్దలకు చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన సిద్ధార్థ అతని వర్గం అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిల్ కుమార్ యాదవ్ సమక్షంలోనే కర్నూలు పాత బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎమ్మెల్యే ఆర్థర్, అతని వర్గంపై దాడికి దిగారు. మళ్లీ కొద్ది కాలానికి కర్నూలులోని కొత్త బస్టాండ్ వద్ద గల ఓ ప్రైవేటు హోటల్ లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎదుట మళ్లీ దాడి చేసేందుకు సిద్ధార్థ వర్గం ప్రయ త్నించింది. ఇలా ఈ నాలుగేళ్లలో ఆర్థర్‌ను అవమానపరు స్తూ, ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నాడు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న ఆర్థర్ నియోజకవర్గంలో సిద్ధార్థ ప్రమే యాన్ని వ్యతిరేకిస్తున్నాడు. సిద్ధార్థ తనకు అడ్డు తగలకుం డా ఉంటాడని హామీ ఉంటేనే తాను ఎమ్మెల్యేగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని, లేకుండా తన దారి తాను చూసుకుంటానని చెప్పినట్లు సమాచారం. అయితే సిద్ధార్థ ప్రమేయం లేకుండా ఆర్థర్‌కు టికెట్ ఇస్తే ఓటమి తప్పదని పార్టీ అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

● లెక్క గట్టిగా ముట్టజెప్పే వారికే..

సర్వేల్లో ఆర్థర్‌కు అనుకూలంగానే ఫలితాలు వచ్చాయి. అయితే అధిష్టానం ఇవేవి పట్టించుకునే స్థితిలో లేదు. టికెట్ కేటాయింపు కోణాన్ని డబ్బు కోణంలోనే చూస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టలేని ఆర్థర్‌ను కాదని, లెక్క గట్టిగా ముట్టజెప్పడంతో పాటు, ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు పంచే వ్యక్తి కోసం గాలిస్తోందని సమాచారం. అందుకే తెరపైకి కొత్త వ్యక్తులను తీసుకు వస్తున్నట్లు అధికారపార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.



నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్

● ఎవరికి వారే ప్రయత్నాలు..

నందికొట్కూరు టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ కాకుండా మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వేల్పుల ఆనంద్, ఎక్కలదేవి చంద్రమౌళి పేర్లు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు కూడా సిద్ధార్థ వర్గానికి చెం దిన వారే కావడం గమనార్హం. వీరి పేర్లను ఇప్పటికే సిద్ధార్థ వైసీపీ అధిష్టానానికి సూచించినట్లు తెలుస్తోంది. లబ్బి వెం కటస్వామి గతంలో గెలిచిన చరిత్ర ఉండటం వల్ల ఈసారి గట్టిగా ప్రయత్నిస్తే తనకు టికెట్ ఖాయం అన్న ధీమా లో ఉన్నాడు. ఇక సిద్ధార్థ నందికొట్కూరు వచ్చినపుడు, ఆయన చేసే కార్యక్రమాలకు డబ్బులు బాగానే ఖర్చు పెట్టాడన్న ప్రచారం ఉంది. దీంతో సిద్ధార్థ తనకు మద్దతు పలుకుతారని, టికెట్ రావడం పెద్ద కష్టం కాదని చంద్ర మౌళి భావిస్తున్నా రు. సిద్ధార్థ తన వైపే ఉన్నాడు కాబట్టి తనకు టికెట్ వస్తుందని ఆనంద్ యోచిస్తున్నాడు. దీంతో ఎవరికి వారే టికెట్ ప్రయత్నాల్లో మునిగిపోయారు. ఇప్ప టికే వీరి పేర్లను పార్టీ పెద్దలు పరిశీలించినట్లు తెలుస్తోంది. వీరిపై ఇప్పటికే సర్వే నిర్వ హించగా ఈ ముగ్గురికి ప్రతి కూల ఫలితాలు వచ్చినట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మె ల్యేను నమ్మి ఎన్నికలకు పోలేక.. సిద్ధార్థరెడ్డి వర్గానికి చెంది న అభ్యర్థులను ఖరారు చేయలేక అధిష్టానం సతమతవుతు న్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నా యంగా కడప జిల్లా కు చెందిన డా.సుధీర్ పేరును తెరపైకి తీసుకు వచ్చారు. ఈయన హై దరాబాదులో వైద్యుడుగా పని చేస్తున్నాడు. జగన్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటంతో నందికొట్కూరు నియోజకర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఆయన సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి దిగిన ఫొటో ఒకటి నందికొట్కూరు నియోజకవర్గంలో చక్కర్లు కొడుతుండ టం ఈ ఊహాగానాల కు మరింత బలాన్ని చేకూరుస్తోంది. అయితే సుధీర్ అభ్య ర్థి అనే విషయాన్ని సిద్ధార్థ వర్గం జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం.

● సిద్ధార్థ వర్గంలో ఆందోళన..

నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేయడాన్ని సిద్ధార్థ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంపై సిద్ధార్థను నిలదీసినట్లు కూడా సమాచారం. తమకు టిక్కెట్ వస్తుందని ఆశతో ఇన్ని రోజులు ఖర్చు పెట్టుకున్నామని, ఇప్పుడు తమ పేరు కాకుండా ఇతరులను తెరపైకి తెస్తే తమ సంగతి ఏమిటని సిద్ధార్థ వర్గీయులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత వీరిలో కొంతమంది నాన్ లోకల్ అభ్యర్థులకు సీటు ఇవ్వడం సరికాదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. లబ్బి వెంకటస్వామి ఏకంగా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంపై అవగాహన లేని వారికి టిక్కెట్ ఇస్తే సహించేది లేదన్నారు. అయితే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎవరినైతే అభ్యర్థిగా ప్రకటిస్తారో వారిని గెలిపిద్దామని ఆయన నాయకులు, కార్యకర్తలకు సూచించినట్లు సమాచారం. ఇలా అయితే తమ టికెట్ ఆశలు గల్లంతవుతాయని భావించిన లబ్బి వెంకటస్వామి, సిద్ధార్థతో కలిసి మొన్న సోమవారం విజయవాడలో జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఇదిలాఉంటే అసలు కడపకు చెందిన డా.సుధీర్‌ను తెరపైకి తీసుకు వచ్చింది సిద్ధార్థేనన్న ప్రచారం మరోవైపు జరుగుతోంది. అధిష్టానానికి నామ మాత్రంగా ఇక్కడి వారి పేర్లు సూచించి తనకు కడపలో ఉన్న సంబంధాలను దృష్ట్యా డా.సుధీర్‌కు మద్దతు తెలుపుతున్నాడన్న ప్రచారం సాగుతోంది.



సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకట స్వామి (ఫైల్)

● టీడీపీ వైపు ఎమ్మెల్యే వర్గం చూపు..

ఇటు సిద్ధార్థ.. అటు పార్టీ అధిష్టానం ఇతరుల పేర్లు పరిగణలోనికి తీసుకోవడంతో ఎమ్మెల్యే ఆర్థర్ వర్గంలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. సీఎం సొంత జిల్లాకు చెందిన వ్యక్తి పేరు తెరపైకి రావడంతో ఎమ్మెల్యే సైతం ఏమి చేయలేని స్థితిలో పడ్డారు. ఎమ్మెల్యేకే టిక్కెట్ వస్తుందన్న నమ్మకంతో ఉన్న ఆర్థర్ వర్గంలో గుబులు మొదలైంది. టిక్కెట్ రాకపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో ఆయన వర్గం పడిపోయింది. దీంతో నాలుగు రోజుల కిందట కర్నూలులోని ఎమ్మెల్యే నివాసంలో తన వర్గంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సర్వేల్లో మంచి ఫలితాలు ఉన్నా వేరే వారి పేర్లను ఆలోచిస్తోందంటే, పార్టీకి తమ అవసరం లేదని భావిస్తోందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు తెలుస్తోంది. అవసరం లేదనుకున్న పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని కొంతమంది ముఖ్య నాయకులు ఆర్థర్ ముందు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ముందుగానే ఏదో దారి చూసుకుంటే మంచిదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు సమాచారం. ఇక ఆర్థర్‌కు భార్య తరుపున చుట్టరికం ఉన్న నంద్యాలకు చెందిన కొంతమంది టీడీపీలో చేరితే ఎలా ఉంటుందని ఇక్కడి నాయకులను అడిగినట్లు సమాచారం. మొత్తానికి కొత్తవారికి టిక్కెటు ఇస్తే ఎమ్మెల్యే ఆర్థర్‌కు తీవ్రంగా అన్యాయం చేయడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక

● 9346188819 సెల్ నెంబర్ నుంచి కాల్ వచ్చిందా.. జాగ్రత్త

నంద్యాల క్రైం, జనవరి 12: ఆధునిక సాంకేతికతను సైబర్ కేటుగాళ్లు అనుకూలంగా మలుచుకుంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతో సెల్‌ఫోన్ నెం 9346188819 నుంచి కాల్ చేసి తాను ఏఎస్పై అశోక్ కుమార్ అని గాని, అశోక్‌రెడ్డి అని గానీ లేదా ఫలానా ప్రభుత్వ శాఖ అధికారిననిగాని నమ్మబలికి తమ బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని, తన ఫోన్ పేలో డబ్బులు లేవని, అర్జంట్‌గా పంపిస్తే గంటలో తమ పోలీస్ కానిస్టేబుల్‌తో నగదు పంపిస్తానని మోసం చేస్తారని అన్నారు. ఇలాంటి సైబర్ మోసాలు ఇప్పటికే రాష్ట్రంలో 14 కేసులు నమోదయ్యాయని తెలిపారు. నంద్యాలలోనే ఐదు కేసులు నమోదయ్యాయని వివరించారు. డోన్, ఆత్మకూరు, చాగలమర్రి, గడివేముల, బనగానపల్లె ప్రాంతాల్లో సైబర్ క్రైం మోసాలు జరిగాయని వెల్లడించారు. ఎవరైనా ఈ మోసాలకు గురైతే వెంటనే 24 గంటల్లోపు నేషనల్ సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సైబర్ క్రైం ఆఫీస్‌కు వచ్చిగాని 9154987034 నెంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా ఆటో డ్రైవర్ మృతి



ఆటోకు ఉరి వేసుకున్న ఎరుకలి రాముడు

పత్తికొండ, జనవరి 12: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన పత్తికొండ శివారులో సిద్దం పెట్రోల్ బంక్ సమీపంలో జరి గింది. ఆదోని ఇంద్రానగర్‌కు చెందిన ఎరుకలి రాముడు (41) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య సులోచనతోపాటు ముగ్గురు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసైన రాముడు నిత్యం భార్యతో గొడవకు దిగి ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. మూడునెలల క్రితం భార్యతో గొడవ పడి వెళ్లిపోయి రెండు రోజులు క్రితం ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువా రం రాత్రి మళ్లీ భార్యతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయాడు. పత్తికొండ శివా రులో సిద్ధం పెట్రోల్ బంక్ వెనుక నిర్మానుష్యప్రాంతంలో మద్యం తాగి ఆటోకు ఉరి వేసుకున్న స్థితిలో మృతి చెంది కనిపించాడు. ఆటోలో ఉన్న లైసెన్స్ ఆధారం గా మృతుడిని గుర్తించిన పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించా రు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ మురళీమోహన్ తెలిపారు.

గుప్తనిధుల కలకలం

వెల్దుర్తి, జనవరి 12 : మం డలంలోని రామళ్లకోట గ్రామంలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గుప్తనిధుల కలకలం చెలరేగింది. గురువారం అమావా స్య కావడంతో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి ఆలయ మండపం పైకప్పు భాగంలో ఒకే రాతితో సీలింగ్‌కు చెక్కబడిన రాతి కమలాన్ని ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. పూజారి సురేష్ రోజూ మాదిరిగానే ఆలయం తెరవడానికి శుక్రవారం తెల్లవారుజామున వెళ్లాడు. రాతి కమలాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఈ విషయాన్ని గమనించి స్థానికులు, ఆలయ కార్యనిర్వహణ అధికారికి తెలియజేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కేంద్ర మంత్రి

మంత్రాలయం, జనవరి 12 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేంద్ర బొగ్గు, గనులు శాఖ మంత్రి ప్రహ్లాదజోషి శుక్రవారం సాయం త్రం మంత్రాలయం వచ్చారు. ఈయనకు పద్మనాభ తీర్థ గెస్ట్‌హౌస్ వద్ద డీఎస్పీ సీతారామయ్య, శ్రీమఠం అధికారులు ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. శుక్రవారం మంత్రాలయంలోనే బసచేసి శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు పొందనున్నారు. కార్యక్ర మంలో గిరీశ్ కనకవీడు, ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు, ఏఎస్‌ఐ ఆనంద రెడ్డి, వ్యాసరాజ్ ఆచార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు మిర్చి యార్డుకు సెలవు

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 12 : ఈ నెల 14న ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మిర్చి యార్డుకు సెలవు ఉంటుందని యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం వ్యాపారుల విజ్ఞప్తి మేరకు క్రయవిక్రయాలు జరగవన్నారు. యథావిధిగా బుధవారం నుంచి మిర్చి కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్టు

టాటా సుమో వాహనం.. ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

సూత్రధారి ఏపీఎస్పీ బెటాలియన్‌లో పని చేసిన కానిస్టేబుల్



నిందితులతో డీఎస్పీ వెంకటరామయ్య

ఆళ్లగడ్డ, జనవరి 12: గతంలో ఏపీఎస్పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసి అవినీతి ఆరోపణలతో ఉద్యోగం పోగొట్టుకున్న రుద్రవరానికి చెందిన గోన నాగేంద్రుడిని, మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గోన నాగేంద్రుడు వివిధ ప్రాంతాలలో కిడ్నాపులకు పాల్పడేందుకు ఒక ముఠాను తయారు చేశాడని అన్నారు. ఎనిమిది మంది ఉన్న ఈ ముఠాలో అతనితోపాటు ఇండ్ల రాముడు, అడ్డాకుల రాముడు, ఒక మైనరును శుక్రవారం ఆళ్లగడ్డ రూరల్ పరిధిలోని పెద్దకందుకూరు మెట్ట వద్ద రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐ నరసింహులు అరెస్టు చేశారని ఆయన వివరించారు. వీరితో పాటు టాటాసుమో, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని ఆయన చెప్పారు. వీరంతా అహోబిలంలో ఈ నెల 4వ తేదీన ఏపీ 27 టీవీ 0823 నంబరుగల టాటా సుమోను దొంగలించినట్లు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ వాహనంతో కడప జిల్లా కామనూరుకు చెందిన బాగా డబ్బున్న నంద్యాల రామవరదరాజురెడ్డిని కిడ్నాపు చేసి రూ. 50 లక్షలు డిమాండు చేయాలని ప్రయత్నించి విఫలం అయ్యారని అన్నారు. దీనిపై ప్రొద్దుటూరు పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. గత ఏడాది అక్టోబరు నెలలో జీపు బాడుగకు తీసుకొని నంద్యాల దగ్గరలోని పెద్దకొట్టాలకు చెందిన టీ కొట్టు శెట్టిని కిడ్నాపునకు ప్రయత్నించారని, నవంబరు నెలలో రుద్రవరం సుబ్బయ్యను బొలేరా వాహనంలో కిడ్నాపునకు యత్నించారని అన్నారు. అలాగే అహోబిలం ఫైనాన్స్ సుబ్బారెడ్డి, దువ్వూరు రామకృష్ణారెడ్డిలను కిడ్నాపు చేసేందుకు ఈ ముఠా ప్రయత్నించి విఫలమైందని అన్నారు. ఈ ముఠాపై రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐ నరసింహులు తమ సిబ్బందితో నిఘా ఉంచి నల్గురిని అరెస్టు చేసినందులకు డీఎస్పీ వెంకటరామయ్య అభినందించారు.

ఆర్‌యూలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ పరిశీలన

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 12 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రాయలసీయ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటు కోసం భవనాలను కలెక్టర్ డాక్టర్ జి సృజన, ఎస్పీ కృష్ణ కాంత్ పరిశీలించారు. శుక్రవారం కలెక్టర్ ఎస్పీ రాయలసీమ యూనివర్సిటీలోని సాంకేతిక శాస్త్ర కళాశాల బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్ 4, ఓల్డ్ లైబ్రరీ, నూతన లైబ్రరీ తదితర భవనాలను పరిశీలంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 8 నియోజకవర్గాలకు సంబంధించి రాయలసీయ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ సెంటర్లకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నారపు రెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మధుసూదన్ రావు తదితదరులు పాల్గొన్నారు.



భవనాలను పరిశీలిస్తున్న కలెక్టరు, ఎస్పీ

అహోబిలాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జనవరి 12: అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి నూరు తడ నైవేద్యం అర్చకులు శుక్రవారం సమర్పించారు. అహోబిలం క్షేత్రంలో జరుగుతు న్న 27వ రోజు ధనుర్మాస పూజల్లో భాగంగా నైవేద్య సమర్పణలో పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ పాల్గొన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు.

డిగ్రీలో ఏడుగురి డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 12: డిగ్రీ 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్‌లో 830కి 749 మంది, 5వ సెమిస్టర్లో 5,753 మందికి 5,488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

క్రిష్ణగిరి, జనవరి 12: మండలంలోని తెగదొడ్డి గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. మల్లికార్జున తన కొట్టం సమీపంలో కొత్తగా కట్టుకున్న ఇంటికి నీళ్ళు కొట్టేందుకు మోటార్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభు త్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొడుకు బోయ గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై తెలిపారు.

ఆధ్యాత్మిక విలువలు పెంచుకోవాలి

● ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



ప్రవచన బోధ చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కర్నూలు(కల్చరల్), జనవరి 12: విద్యార్థుల్లో బాల్యం నుంచే ఆధ్యాత్మిక విలువలు పెంచాలని ప్రముఖ ప్రవచ నకర్త చాగంటి కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం నగరంలోని ఎస్ఏపీ క్యాంపు టీజీ వెంకటేశ్ క్రీడా మైదానంలో, యువ ప్రజానాయకుడు టీజీ భరత్ సహకారంతో ఏర్పాటు చేసిన 'విద్యార్థులతో ముఖాముఖి' కార్యక్రమంలో చాగంటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వందలాదిగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉద్బోధించారు. చదువుకునే సమయంలో ఒత్తడి గురైనట్లు గమనిస్తే ఆ ఒత్తిడిని తగ్గించుకునేందుకు హాస్య సంబంధ కథలు చదవాలని, వినాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు అభిరుచి ఉన్న రంగాల్లో సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వ్యక్తం చేసిన పలు సందేహాలను ఆయన సోదాహరణలతో వివరించారు.

కేడీసీసీ చైర్‌పర్సన్‌గా
మరో ఆరు నెలల పొడిగింపు



విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 12: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్‌గా విజయమనోహరి పదవీ కాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ ప్రభుత్వం జీవో నెం 28ని జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం ఈ నెల 18 నుంచి జూలై 17 వరకు విజయమనోహరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మెన్‌గా కొనసాగుతారని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి తెలిపారు. కర్నూలుతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు ప్రభుత్వం పొడిగించింది. డైరెక్టర్లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ప్రెసిడెంట్ల పదవీ కాలం కూడా పొడిగించినట్లు ఉత్తర్వులు వచ్చాయని అధికారులు తెలిపారు.

వైసీపీ పతనం ఖాయం

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జనవరి 12: రాష్ట్రంలో మార్పు మొదలైందని..వైసీపీ పతనం ఖాయమని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు ముజఫర్‌నగర్‌లోని మాదిరాజ్‌నగర్‌లో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో ఇంటింటికీ తిరిగి ప్రజలు సమస్యలు తెలుసుకుని ఆమె టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ ఎన్నికల హామీలను విస్మరించి రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు జగన్‌రెడ్డి ద్రోహం చేశారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రానికి చేసిన మేలు ఏమీ లేదన్నారు. చంద్రబాబు సభలకు వస్తున్న జనాదరణను చూసి వైసీపీ వెన్నులో వణుకు మొదలైందన్నారు. ఇసుక, మద్యం, భూకబ్జాలు, మైనింగ్ దోపిడిపై ఉన్నశ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు సమష్టి పనిచేసి టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్లూరు మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఎస్వీ.రామకృష్ణ, జె.గంగాధర్‌గౌడ్, కె.మహేష్‌గౌడ్, పియూ.మాదన్న, ఎస్.ఫిరోజ్, కేతూరు మధు, రవిప్రకాష్‌రెడ్డి, కోటేష్‌గౌడ్, శాషావలి, సుంకన్న, రాముడు, డిష్‌మదు, మాజీ కార్పొరేటర్ సోమన్న, మౌలాలి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.


35వ వార్డులో ప్రచారంలో చేస్తున్నగౌరు చరిత

● **టీడీపీ ఆళ్ళగడ్డ రా కదలి రా సభ విజయవంతం**

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం రానుందని వైసీపీ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పాణ్యం, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జిలు గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తమ స్వగృహంలో సమావేశం నిర్వహించి ఆళ్ళగడ్డలో నిర్వహించిన రా కదలి రా సభ విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. గౌరు దంపతులు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగన్ ప్రభుత్వంపై సొంత ఎమ్మెల్యేలే ధిక్కారస్వరం వినిపిస్తున్నారని, వైసీపీ అరాచక పాలకు చివరి రోజులుగా అభివర్ణించారు. వైసీపీ నాయకుల అవినీతి వలన ప్రజలు నష్టపోయారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో జగన్ రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. మోసపు హామీలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమి సునామీలో వైసీపీ గల్లంతవ్వడం ఖాయమన్నారు.

బీసీలకు పుట్టినిల్లు టీడీపీ : ఆకెపోగు

గూడూరు జనవరి 12: తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు వంటిదని కోడుమూరు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో జయహో బీసీ గర్జన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ హయాంలో బీసీలకు చేసిన మేలు, వైసీపీ హయాంలో బీసీలకు మోసం చేసిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో బెస్తలకు 90 శాతం సబ్సిడి కింద వలలు, పడవలు ఇవ్వడం జరిగిందన్నారు. చేనేతల కోసం 200 నుంచి 2వేల వరకు పెన్షన్ పెంచడం, 200 యూనిట్లు ఉచిత కరెంట్, మగ్గాల ఆధునీకరణ చేయడం, నాయి బ్రాహ్మణుల కోసం 90 శాతం సబ్సిడీ సెలూన్ పరికరాలు, 3 లక్షల వరకు రుణాలు, బీసీ జనగణన చేసి చట్ట సభల్లో 33 శాతం రిజర్వేన్లు చేసి పార్లమెంట్‌కి పంపడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఎల్ సుధాకర్ రెడ్డి, గజేంద్ర గోపాల్ నాయడు, దండు సుందరరాజు, సత్రం రామకృష్ణుడు, ఎస్ఎ సలీం, మన్సన్‌బాషా, భాస్కర్ రెడ్డి, బంగారు శ్రీనివాసులు, యుగంధర్, మునగాల గోపాల్, నాగప్ప యాదవ్, సుమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


గూడూరులో పోస్టర్లను విడుల చేస్తున్న నాయకులు

వివేకానందుడి స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి

కర్నూలు(అర్బన్), జనవరి 12: వివేకానందుడి స్ఫూర్తితోనే తెలుగునాడు విద్యార్థి సమాఖ్య రాక్షస ప్రభుత్వంపై పోరాటం సాగించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో వివేకానంద జయంతిని ప్రపంచ యువజన దినోత్సవంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద అడుగుజాడల్లో దేశాన్ని ప్రగతి బాటలో నడిపించాల్సిన యువతను.. నేడు రాష్ట్ర ప్రభుత్వం యువతను మాదక ద్రవ్యాల వైపు మత్తు పదార్థాలకు బానిసగా మార్చిందని మండిపడ్డారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు రాజు కుమార్, బొగ్గుల భాస్కర్, తెలుగు హేమంత్, సురేంద్ర, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


వివేకా నంద విగ్రహం వద్ద తెలుగు యువత నివాళి

● జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు ఎస్. అబ్బాస్ తెలిపారు. శుక్రవారం రాజవిహర్ కూడలిలోని వివేకానంద విగ్రహం వద్ద వివేకానంద జయంతి పురస్కరించుకుని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే జాబ్ క్యాలండర్ విడుదల చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నిలువునా మోసం చేశారని, ప్రస్తుతం యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.కార్యక్రమంలో సోమిశెట్టి నవీన్, శ్రీధర్, రవి, సందీప్, రాజు, నాగురాజు యాదవ్, గున్నామార్క్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వామి వివేకానంద జయంతి

కర్నూలు(కల్చరల్), జనవరి 12: స్వామి వివేకానందుని 160వ జయంతిని నగరంలోని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో రాజ్‌విహార్ కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రామవేంద్ర మాట్లాడుతూ యువతలో అనంతమైన శక్తి ఉందని, దాన్ని సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరామ్ యాదవ్, లోకేశ్వరయ్య, మధుగౌడ్, భరత్, జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు గోరంట్ల రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎల్ అమరసింహారెడ్డి, నాయకులు వాసుదేవయ్య, భానుప్రకాశ్, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, గిరిబాబు, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త వాహనం 'ఎంజీ ఆస్టార్' ప్రారంభం


కొత్త కారును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జనవరి 12: నగరంలో హైదరాబాదు, బెంగుళూరు 44వ జాతీయ రహదారిలో, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో కేస్విన్ ఆటో మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఎంజీ మోటార్స్ కార్ల షోరూమ్‌లో శుక్రవారం నూతన ఫ్యూచర్స్‌తో, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 'ఎంజీ ఆస్టార్ కార్‌ను ఘనంగా ప్రారంభించారు. సంస్థ ఎండీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో షోరూమ్‌లో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ షోరూమ్ ఏజీఎం పెద్ది నరేన్‌కుమార్ తెలిపారు. షోరూమ్‌లో లభిస్తున్న వాహనాలు, వాటికి సంబంధించిన సేవలు కస్టమర్లకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేస్విన్ ఆటో మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఎంజీ వాహనాలు అత్యాధునిక ఫీచర్స్‌తో కస్టమర్లను ఆకట్టుకుంటాయని తెలిపారు. వాహనాల కండీషన్, ఇతరత్రా అంశాలు కూడా వేటికవే ప్రత్యేకంగా ఉంటాయని అన్నారు. సంక్రాంతి వేడుకలను కస్టమర్ల మధ్య నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంజీ మోటార్స్ షోరూమ్ సేల్స్, సర్వీస్‌లతోపాటూ వివిధ విభాగాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

25 నాటికి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయండి

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 12 : జిల్లాలో మూడో విడత రీ సర్వేలో భాగంగా జనవరి 25 వ తేదీ నాటికి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుకవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి జిల్లా స్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న స్టోన్స్ అవసరమున్న గ్రామాలకు తరిలించి వాటిని వినియోగించుకోవాలన్నారు. 18 నాటికి భూ హక్కు పత్రాలను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, డీపీఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం ఎరువులను విక్రయిస్తే చర్యలు

సి. బెళగల్, జనవరి 12: రైతులకు నాసిరకం ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయఅధికారి మల్లేష్‌కుమార్ ఫర్టిలైజర్ దుకాణం యజమానులను హెచ్చరించారు. శక్రవారం మండలంలోని పోలకల్లు, సిబెళగల్ గ్రామాలలోని పర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ కార్యక్రమంలో కర్నూలు ఏవో విజయకుమార్, ఎంఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్రికెట్ పోటీల విజేత తడకనపల్లె జట్టు

కల్లూరు, జనవరి 12: ఆడుదాం..ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీల్లో తడకనపల్లె జట్టు విజయం సాధించినట్లు ఎంపీడీవో జీవి.రమణమూర్తి తెలిపారు. శుక్రవారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి ఫైనల్ మ్యాచ్‌లో చిన్నటేకూరు తడకనపల్లె జట్లు తలపడగా తడకనపల్లె జట్టు విజయ సాధించినట్లు అధికారులు తెలిపారు. తడకనపల్లె టీడీపీ సర్పంచు ఎస్.సహరాభి జట్టు సభ్యులను అభినందించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

వాల్మీకి యువగర్జన పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కోడుమూరు (రూరల్), జనవరి 12: కర్నూలులో 20న జరిగే వాల్మీకి యువగర్జనను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని వాల్మీకి విగ్రహం ఎదుట శుక్రవారం యువగర్జన పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్బంగా వాల్మీకి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకుల మధ్య ప్రాంతీయ వ్యత్యాసాలు తొలగించి ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్టీ రిజర్వేషన్ పై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కర్నూలు ధర్నా చౌక్‌లో రిలేదీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. 20న వాల్మీకులు కర్నూలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ వెంకటేశ్వర్లు, పుట్టపాశం రామాంజనేయులు, మునిస్వామి, గోపాల్‌నాయుడు, యల్లప్పనాయుడు, ప్రభాకర్, రమేష్, శేషు, బలరాం, మధు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంక జన్మదిన వేడుకలు


కాంగ్రెస్ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 12: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాన్‌విల్సన్, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, జిల్లా మహిళ అధ్యక్షురాలు ప్రమీల, మహిళా దళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ. వెంకటసుజాత, షేక్ ఖాజా హుస్సేన్, బజారన్న, చంద్రశేఖర్, కేవీ లక్ష్మి, కరుణమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

శివారు కాలనీలపై నిర్లక్ష్యం

● పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి


రోడ్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 12: నగర పాలక సంస్థ పరిధిలోని శివారు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. శుక్రవారం గౌతమినగర్, నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతాలలో జరుగుతున్న పనులను కమిటీసభ్యులు పరిశీలించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ శివారు కాలనీ అభివృద్ధిపై నగర పాలక సంస్థ అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో యాకోబు, లక్ష్మీరెడ్డి, శంకరయ్య, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ర్యాంకు పడిపోవడానికి కమిషనర్ కారణం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 12: కర్నూలు నగర పాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షన్‌లో ర్యాంకు దిగజారడానికి ప్రధాన కారణం కమిషనర్ ఏ. భార్గవతేజనే అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు శుక్రవారం విమర్శించారు. కార్మికుల పట్ల కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుకు నిదర్శనంగానే గత సంవత్సరం 2వ ర్యాంకు నుంచి ఈ సంవత్సరం 5 ర్యాంకు వచ్చిందని అన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లు సమస్యలను పరిష్కరించాలని 27 రోజులుగా ఆందోళన చేస్తున్న కమిషనర్ పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి ఉంటే నగర పాలక సంస్థ రాష్ట్రంలో మొదటి ర్యాంకు వచ్చేదని ఆయన అన్నారు.

వైసీపీ దొంగ ప్రభుత్వం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 12: వైసీపీ దొంగ ప్రభుత్వమని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం పంపిన రూ.988 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు దొంగలించిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం కొట్టేసిన రూ.6 కోట్లను నాలుగురోజుల్లో గ్రామ, మండల, జిల్లా పరిషత్ ఖాతాల్లో జమచేయాలని, లేని పక్షంలో రాజకీయాలకు అతీతంగా పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రెగ్యులరైజేషన్ కోసం ఆఫీసుకు రావద్దు

కర్నూలు(హస్పటల్), జనవరి 12: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులరైజేషన్‌కు అర్హులైన ఉద్యోగులు ఎవరు ఏ ఒక్కరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కర్నూలు డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. రామగిడ్డయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెగ్యులరైజేషన్ పని నిమిత్తం ఉద్యోగులు ఎవరూ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆఫీస్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యోగులు పని చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డ్రాయింగ్ ఆఫీసర్ వద్దనే వారి వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలని, ఉత్తర్వుల మేరకు అర్హత ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తామని పేర్కొన్నారు.

స్వామి వివేకానందకు ఎమ్మెల్యే నివాళి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 12: స్వామి వివేకానందకు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ నివాళులర్పించారు. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజవిహార్ కూడలిలో స్వామి వివేకానంద విగ్రహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శి భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దశ దిశలా చాటి చెప్పిన ఔన్నత్యమూర్తి వివేకానంద అని కొనియాడారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హుశేనాపురంలో నాసర్ షరీఫ్ ఉరుసు

ఓర్వకల్లు, జనవరి 12: మండంలోని హుశేనాపురం గ్రామంలో 14 నుంచి 16 వరకు ఉరుసు నిర్వహిస్తున్నారు. 14న గంధం, 15న ఉరుసు 16న కీస్తీలు నిర్వహిస్తున్నామన్నారు. 15న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షాదిక్‌బాషా తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి రసీదు పొందాలన్నారు. విజేతలైన జట్లుకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

లక్కీ టూకు టీడీపీ ఎంపీ సీటు ఇవ్వాలి


యాదవ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 12: లక్కీటూ రాంపుల్లయ్యకు టీడీపీ ఎంపీ సీటు కేటాయించాలని యాదవ్ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలోని ఆర్ఆర్ హాస్పిటల్‌లో యాదవ సంఘాల జేఏసీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలమద్దయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవులకు రాజకీయంగా ఏ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందో ఈ పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని, లేని పక్షంలో యాదవుల సత్తా చూపించే సమయం ఆసన్నమైందని అన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో వైసీపీ ఒక్క సీటు కూడా యాదవులకు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో ప్రముఖ అఖిల భారతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అయ్యన్న యాదవ్, కోకన్వీనరు సింధు నాగేశ్వరరావు, సోమన్న యాదవ్, సీనియర్ యాదవ్ సంఘం నాయకులు కృష్ణమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

పేద వృద్ధ కళాకారులకు పారితోషికాలు


టీజీవీ కళాక్షేత్రంలో సంక్రాంతి సంబరాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు(కల్చరల్), జనవరి 12: టీజీవీ కళా క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా నగరంలోని 50 మంది నిరుపేద వృద్ధ కళాకారులకు ఏడాది పాటు నెలకు రూ.1000 చొప్పున పారితోషికాలు పంపిణీ చేస్తున్నామని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. శుక్రవారం కళాక్షేత్రంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ సంగీతం, నాటకం, నృత్యం, సాహిత్యంతోపాటూ వివిధ సంప్రదాయ కళల్లో రాణిస్తున్న 60 ఏళ్ల పైబడి పేద కళాకారులకు ఈ పారితోషికాలు ఈ ఏడాది డిసెంబరు వరకు అందజేస్తామని తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న కళాకారులు తాము కృషి చేస్తున్న కళారంగానికి సంబంధించిన క్లిప్పింగ్స్ జతచేసి దరఖాస్తులను ఈ నెల 20లోగా టీజీవీ కళాక్షేత్రం కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంపిక చేసిన 50 మంది కళాకారులకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా జనవరి 26న పారితోషికాలు అందజేస్తామని తెలిపారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్: టీజీ భరత్


మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 12: టీడీపీతోనే యువతకు భవిష్యత్ ఉంటుందని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదిలి..రా కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. పెరిపోయిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, పన్నులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ధరలు నియంత్రణలో ఉంటాయన్న భరోసా ప్రజలకు ఇస్తున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్‌కు గ్యారెంటీ ఇస్తుందన్నారు. ఇక కర్నూలు ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీరాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

నారా హమారా... టీజీ హమారా

● ఇంటింటికి మైనార్టీ నాయకులు


నగరంలో మైనార్టీల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో మైనార్టీలు

కర్నూలు(అర్బన్), జనవరి 12: తెలుగు దేశం పార్టీ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో నారా హమారా... టీజీ భరత్ హమారా నినాదంతో నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం మొదలు పెట్టారు. శుక్రవారం గనరంలోని 6 వార్డులోని గరీబ్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనేఫెస్టోలో ఉన్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీజీ కుటుంబం ముస్లింలకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సెల్ సెక్రటరీ జహంగీర్ బాషా, మైనార్టీ కమిటీ నగర అధ్యక్షుడు హమీద్, ప్రధాన కార్యదర్శి మోహబూబ్, ఇమ్రాన్ సలీం, జుబేర్ ఖాన్, అబ్దుల్ రజాక్, మహ్మద్ గౌస్, షేక్ మున్నా, జీమ్ ఖాజా, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పడిదెంపాడులో ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న టీడీపీ నాయకుడు దస్తగిరి

కర్నూలు(రూరల్), జనవరి 12: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని కర్నూలు రూరల్ మండలం పడిదెంపాడు గ్రామంలో శుక్రవారం టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ. తృతీయ స్థానంలో శ్రావణి, పార్వతి, శకుంతల ఎంపికయ్యారు. గెలిచిన విజేతలకు కోడుమూరు నియోజకవర్గ టీడీపీ యువనాయకుడు బొగ్గుల దస్తగిరి స్థానిక టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌గౌడ్, శంకర్‌నాయుడు, ఎంపీటీసీ పవన్, వైస్ సర్పంచు చంటి, పెద్దలు రాజులు, వందనమయ్య, హనుమన్న, సంపత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ


ఓర్వకల్లులో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు, జనవరి 12: ఓర్వకల్లులో శుక్రవారం అయోధ్యరామయ్య అక్షింతలు ప్రతి ఇంటికి వెళ్లి పంపిణీ చేసినట్లు నిర్వాహకులు నాగరాజు చెప్పారు. ఈనెల 22న అయోధ్యరామలయంలో ప్రాణ ప్రతిష్ట జరగనున్న నేపథ్యంలో శీతారాముల వారి అక్షింతలు మండలంలోని అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తున్నట్లు..ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీరామరెడ్డి, చలపతి, కాంతయ్యకృష్ణారెడ్డి, స్వామిరెడ్డి, రంగారెడ్డి, రమాణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అర్బన్ వార్డుల అధ్యక్షుడిగా పెరుగు పురుషోత్తంరెడ్డి


జిల్లా అధ్యక్షుడు మల్లెల, గౌరు దంపతుల నుంచి నియామక పత్రం అందుకుంటున్న పురుషోత్తంరెడ్డి

కల్లూరు, జనవరి 12: పాణ్యం నియోజకవర్గంలోని టీడీపీ కల్లూరు అర్బన్ 16వార్డుల అధ్యక్షునిగా కర్నూలు మాజీ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి నియామకమయ్యారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు విడుదల చేసిన పార్టీ పదవుల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పెరుగు పురుషోత్తంరెడ్డి, పెద్దపాడు పెద్దబీచుపల్లికి చోటు దక్కింది. అందులో భాగంగా గౌరు నివాసంలో పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం గౌరు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, రాధాకృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలి

- రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య


జాతీయ నృత్య పోటీల బహుమతి ప్రదానోత్సవ సభను ప్రారంభిస్తున్న జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి తదితరులు

కర్నూలు(కల్చరల్), జనవరి 12: సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ స్థాయి కూచిపూడి, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథులుగా జి. పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు భారతి, వీహెచ్‌పీ నాయకుడు డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, వెంకట నారాయణ గుప్త తదితరులు హాజరయ్యారు. సభలో వక్తలు మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం సంప్రదాయ కళల పరిరక్షణకు పోటీలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ సుదర్శన్, వ్యాఖ్యాత సునీత పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

కురువలకు టిక్కెట్లు ఇవ్వకపోతే సత్తా ఏంటో చూపిస్తాం



మాట్లాడుతున్న జిల్లా కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు

ఆదోని, జనవరి 12 : కర్నూలు జిల్లాలో కురువలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రధాన పార్టీలు ఎమ్మెల్యే సీట్లు కురువలకు ఇవ్వాలని జిల్లా కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అన్నారు. శుక్రవారం ఆదోనిలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షల ఓట్లు కురువలవి ఉన్నాయన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ కురువలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించకపోతే జిల్లాలోని అన్ని స్థానాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు నిలబెడతామని హెచ్చరించారు. ఇప్పటికే పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు స్థానాల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కురువలు 50 వేల నుండి 70 వేల వరకు ఉన్నారని, గెలుపోటములను నిర్ణయించే సత్తా కురువలకు ఉందన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, బీఎస్ టాకీస్ వెంకటేష్, పకీరప్ప, శివరాం, హనుమంతు, సురేంద్ర పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ముగ్గుల పోటీలు

ఆదోని టౌన్, జనవరి 12: మునిసిపల్ ప్రాంగణంలో పొదుపు గ్రూపు మహిళలకు శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. మెప్మా విభాగంతో పాటు, వివిధ పొదుపు గ్రూపులకు చెందిన 150 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు 26న జరిగే గణతంత్ర దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని కమిషనర్ రఘునాథ రెడ్డి తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

మద్దికెర, జనవరి 12: మండలంలోని 8 గ్రామ పంచాయతీల 15వ ఆర్థికసంఘం నిధులు విడుదలైనట్లు ఈవోఆర్డీ మద్దిలేటిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బసినేపల్లికి రూ.2.17లక్షలు, బొమ్మనపల్లి రూ.95వేలు, బురుజుల రూ.1.76లక్షలు, హంప రూ.1.42లక్షలు, ఎం.అగ్రహారం రూ.4.42లక్షలు, మద్దికెర రూ.12.92లక్షలు, పెరవలి రూ.6.86లక్షలు, యవడలి రూ.లక్ష16వేలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా గ్రామ పంచాయతీలలో అబివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

మద్దికెర, జనవరి 12: మండలంలో ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలు చేతికి రాలేదని, ప్రభుత్వం రబీ పంటలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు భీమలింగప్ప, రేవప్పలు కోరారు. శుక్రవారం ఏవో రవి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఈ ఏడాది ఖరీఫ్, రబీలలో సాగు చేసిన పంటలు రెండు చేతికి రాక అప్పుల పాలయ్యారన్నారు. జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపి పంటనష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. ఏవో రవి మాట్లాడుతూ నివేదికలను తయారు చేసి జిల్లా అధికారులకు పంపామని, ఖరీఫ్‌కు సంబంధించి పంటనష్టపరిహారం త్వరలోనే అందుతుందని అన్నారు. వీఏఏలు జాకీర్‌హుసేన్, ఆనంద్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



జొన్నగిరిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి, జనవరి 12: అలనాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ పాఠశాల విద్యాభ్యాస్యాన్ని తలుచుకుంటూ పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జొన్నగిరిలో 1996 నుంచి 2021 వరకు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యను అభ్యసించిన విద్యార్థులు పూర్వపు విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. విద్యార్థులు పాఠశాలతో ఉన్న అనుబంధాలను పంచుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానాలను నిర్వహించారు. అలాగే పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ



మంత్రాలయం, జనవరి 12: వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. శుక్రవారం ధనుర్మాస పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు ఉదయం నుంచి బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. అర్చకులు హస్తోదకం చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ప్రవచన మంటపంలో పండితులు ప్రవచనాలు నిర్వహించారు.

మురుగును తొలగించరా?



ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగు నీటిని చూపుతున్న నాయకులు

ఆదోని రూరల్, జనవరి 12: గ్రామాల్లో మురుగునీటిని అధికారులు పట్టించుకోరా అని సీపీఎం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి లింగన్నలు ప్రశ్నించారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం హనవాళ్ గ్రామంలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏ వీధి చూసినా డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని, రోడ్లన్నీ చెత్త చెదారంతో నిండిపోయాయన్నారు. కనీసం అధికారులు వారానికొక్కసారైనా గ్రామాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీసీ కార్పొరేషన్లను నీరుగార్చిన జగన్

బీసీ సామాజిక యాత్ర చేస్తున్న వారికి జగన్ మొండి చేయి: కోట్ల సుజాతమ్మ

ఆలూరు రూరల్, జనవరి 12 : వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా నీరుగార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం మొలగవల్లి గ్రామంలో మండల కన్వీనర్ అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టీడీపీ అండగా నిలిచిందని అన్నారు. మొట్ట మొదటిసారిగా బీసీలకు రిజర్వేషన్ తెచ్చిన ఘనత ఎన్టీ రామారావుదే అని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి, చంద్రబాబు నాయుడు అండగా నిలిచారని తెలిపారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ తప్పు చేయని చంద్రబాబును అక్రమ కేసుల్లో ఇరికించారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువ అయ్యాయని, 64 మంది బీసీలపై హత్యలు జరిగాయని చెప్పారు. వైసీపీ చేస్తున్న బీసీ సామాజిక బస్సుయాత్ర చేస్తు, మరో వైపు ప్రజా ప్రతినిధులు సంజీవ్‌కుమార్. పార్థసారథి తదితరులకు మొండి చేయి చూపారని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబు నాయుడు సీఎం అవుతారని చెప్పారు. టీడీపీ కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా, పార్టీ అండగా ఉంటుందని అన్నారు. జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ రాష్ట్ర నాయకులు రాంనాథ్ యాదవ్, మనేకుర్తి రాజశేఖర్, మండల కన్వీనర్లు విజయ భాస్కర్ గౌడ్, శేక్షవలి, తిప్పయ్య, సుధాకర్, జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, కిషోర్, సోమశేఖర్, నాగరాజు, కమ్మరచేడు దేవేంద్రప్ప, మద్దిలేటి యాదవ్, లక్ష్మీరెడ్డి, సర్పంచి రాజశేఖర్, ఎంపీ రంగన్న, ఆంజనేయ్య, ఈరప్ప యాదవ్, రంగస్వామి, కృష్ణ యాదవ్, తిమప్ప, టీసీ రంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

టీడీపీ విజయం తథ్యం

ఆస్పరి: రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆస్పరి సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణయాదవ్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ బైలు పత్తికొండ గోవిందు, మాజీ మండల కన్వీనర్ ఎస్ తిమ్మన్న ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి, మొలగవల్లి గ్రామాల్లో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, నగరూరు గోపాల్, రాజశేఖర్, నారాయణ, నాగన్న పాల్గొన్నారు.

చిప్పగిరి: టీడీపీలో బీసీ వర్గాలకు పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్యే, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం చిప్పగిరిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీసీల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకున్న జగన్ ఉత్తుతి కార్పొరేషన్లు సృష్టించి ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు మీనాక్షినాయుడు, మరళీధర్ రెడ్డి, ఎంపీటీసీ, రజనీ, టీడీపీ నాయకులు, రఘుప్రసాద్ రెడ్డి, ఉమాకాంత్ స్వామి, సర్పంచ్‌లు, పరుషోత్తం, సుశీల, తిమ్మయ్య, కిష్టప్ప, అంపయ్య, మేకల రామాంజి, హరి, రామచంద్ర, తిమ్మప్ప, చంద్ర, దానప్ప, అమ్రేష్, బాలన్న, భీముడు, సనప్ప, మీసాల బసప్ప, నెట్టప్ప, గోవింద్, కొండ రాము, శీన పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్ : బీవీ

నందవరం, జనవరి 12: బీసీల ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి విమర్శించారు. నందవరంలో శుక్రవారం 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి నివాళి అర్పించి అనంతరం బీసీ సభలో మాట్లాడారు. బీసీల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. ఓటమి భయంతోనే ఎమ్మిగనూరులో బీసీ సామాజికవర్గాన్ని తెరపైకి తెచ్చారని, ఇన్నేళ్లు బీసీలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు బీసీకు మరింత ప్రాధాన్యం ఇస్తారని అన్నారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి, అమలు చేసి సంక్షేమ పథకాలే మళ్లీ టీడీపీని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాదవరావు దేశాయి, ముగతి ఈరన్నగౌడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, నాగరాజుగౌడు, చిన్నరాముడు, దర్మాపురం గోపాల్, కాశీంవలీ, మస్తాన్, రెహమాన్, బ్రహ్మానందరెడ్డి, గజేంద్రరెడ్డి, లచ్చప్ప, తిమ్మరాజు, తెలుగుఈరన్న, వెంకటేశ్వర్లు, జబ్బార్ పాల్గొన్నారు.



బీవీ జయనాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి: బీజేపీ

ఆదోని టౌన్, జనవరి 12 : వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంద, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో వచ్చి డబుల్ ఇంజన్ పాలన జరిగితే తప్ప రాష్ట్రాభివృద్ధికి అవకాశం లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి బిట్ర వెంకట శివనారాయణ, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మంగళ ఆంజనేయస్వామి దేవాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ జిల్లాలో మౌలిక వసతుల కల్పనలో కొత్త పరిశ్రమ స్థాపనలో, వలసలను నివారించడంలో, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బీజేపీకి ఒక్కసారి అవకాశం కల్పిస్తే, అభివృద్ధి చేసి చూపుతామన్నారు. అనంతరం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మురళి, సీనియర్ నాయకులు కునిగిరి నాగరాజు, రమేష్ యాదవ్; మునిస్వామి, పట్టణ అధ్యక్షులు జిందే సాయి కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మళేకార్ శ్రీనివాసులు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కోకన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఉపేంద్ర కుమార్, మల్లేష్ నాయుడు పాల్గొన్నారు.



సమావేశానికి హజరైన జిల్లా కార్యవర్గ సభ్యులు

బడ్జెట్ కేటాయింపుల ప్రకారం వెచ్చించలేదు

ఎమ్మిగనూరు, జనవరి 12: పురపాలక సంఘం వార్షిక బడ్జెట్‌లో కేటాయింపుల ప్రకారం అధికారులు ఆయా వర్గాల సంక్షేమానికి వెచ్చించటం లేదని మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ వీజీపీ దయాసాగర్ ఆరోపించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ డా. రఘు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2024-25 వార్షిక అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దయాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం రెవిన్యూ మిగులు రూ.3,37,30,500లో స్లమ్ ఏరియా అభివృద్ధికి 40శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5శాతం, స్త్రీలు, పిల్లల సంక్షేమానికి 5శాతం, దివ్యాంగులకు 3శాతం కేటాయిస్తున్నప్పటికీ, ఆ కేటాయింపులు పేపర్లకే పరిమితమవుతున్నాయని అన్నారు. గత ఏడాది కూడా నిధులు ఖర్చుచేసిన దాఖలాలు లేవన్నారు. కనీసం ఈ ఏడాదైన కేటాయంపులు చేసిన ప్రకారం ఆయా వర్గాల అభివృద్ధికి వెచ్చించాలని కోరారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి స్పందిస్తు బడ్జెట్ లో నిధులు కేటాయించామని, ఆ ప్రకారం ఆయా వర్గాల కోసం ఖర్చుచేస్తామని తెలిపారు.

● వార్షికబడ్జెట్‌కు ఆమోదం పురపాలక సంఘం 2024-25 ఏడాదికి సంబంధించిన వార్షిక బడ్జెట్ అంచనాను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ రూ. 68,79,68,431 కేటాయించారు. ఇందులో ప్రారంభపు నిల్వ రూ. 40,19,97,931గాను, సాధారణ జమలు రూ. 18,27,20,500గాను, మూలధన జమలు రూ. 10,32,50,000గా చూపారు. కేటాయింపుల్లో సాధారణ ఖర్చుల కింద రూ. 14,89,90,000, మూలధనపు ఖర్చులు రూ. 12,11,00,000, లోన్ చెల్లింపులు రూ. 40,00,000 చూపారు. ఈ కేటాయింపులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. బడ్జెట్ సమావేశానికి సభ్యులు అంతంత మాత్రమే హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ దయాసాగర్

గుంతల రోడ్లకు మర్మతులెన్నడు: తిక్కారెడ్డి

కౌతాళం/కోసిగి, జనవరి 12: గుంతల రోడ్లకు మోక్షమెన్నడు వస్తుందని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి ప్రశ్నించారు. కోసిగి-హల్వి మధ్య ఉన్న రోడ్డుపై కోసిగి, కౌతాళం నాయకులు కలిసి ధర్నా చేపట్టారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పేరుతో రూ.600కోట్ల రూపాయలతో విరిగిన బ్యాట్లు, పగిలిన బంతులతో క్రీడలు ఆడే బదులు రాష్ట్రంలో ఉన్న ఆర్‌అండ్‌బి గుంతల రోడ్లను మరమ్మతులు చేసి బాగు చేయవచ్చు కదా? అని అన్నారు. కోసిగి-హల్వి మధ్య ఉన్న 10 కిలోమీటర్ల రోడ్డులో సుమారు 200పైగా గుంతలు ఏర్పడి వాహనాలు పోకుండా పూర్తిగా ధ్వంసమయ్యాయని చెప్పారు. గుంతలను కూడా పూడ్చలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటున్న బాలనాగిరెడ్డి 15 ఏళ్ల కాలంలో ఏమి చేశారని ప్రశ్నించారు. ఇటీవల 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా వచ్చిన నారా భువనేశ్వరి నియోజకవర్గ రోడ్లు చూసి స్పందించారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోసిగి-హల్వి రోడ్డు వేయిద్దామని చెప్పినట్లు తెలిపారు. అనంతరం రోడ్డుపై ఆటోలలో వస్తున్న కూలీలతో మాట్లాడారు. కోసిగి, కౌతాళం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం'

కౌతాళం: రాష్ట్రంలో రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైనదని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రమైన కౌతాళంలో శుక్రవారం మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట తెలుగు రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, టీడీపీ నాయకులు బాపురం వెంకటరెడ్డి, రాజానందు, నరసప్ప ఉన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న తిక్కారెడ్డి

నిందితుడిని అరెస్టు చేయాలి

ఎమ్మిగనూరు, జనవరి 12: దేవనకొండ మండలంలోని ఓ గ్రామంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన మునిరంగడును వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దేవసహాయంతో పాటు సంఘం జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, ఉపాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని మండిపడ్డారు. గతంలో గోనెగండ్ల మండలం గంజళ్ల గ్రామంలో ఇలాంటి సంఘటనే జరిగితే ప్రత్యక్షకారకులను అరెస్టుచేసి సూత్రధారులను, సహకరించిన వారిని పక్కన పెట్టారని ఆరోపించారు. నాయకులు ఆంథోని, అంజి, రాముడు,దాసు, చిన్నప్ప, జయరాజు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బంది నిరసన

నందవరం, జనవరి 12: నందవరం వెలుగు కార్యాలయం ఎదుట శుక్రవారం వెలుగు సిబ్బంది నిరసన తెలిపారు. ఏపీఎం వీరన్న మాట్లాడుతు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కారుణ్య నియమాకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్‌ను మరో రెండేళ్ల పెంచాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శబీనాబేగం, జనార్దన్, చిన్నమ్మ, వసుంధర పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



ఆదోనిలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న యువకులు

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 12 : స్వామి వివేకానంద 162వ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక భావాజి మఠం వద్ద వివేకానంద చిత్రపటానికి ఏబీవీపీ పూర్వ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస ఆచారి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్‌ఎల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు మోహన్, మారి, వినయ్, వెంకటేష్, రాము, రంజిత్, భాస్కర్, మహాదేవ్ పాల్గొన్నారు.

ఆదోని టౌన్ : ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం స్వామి వివేకానంద 162వ జయంతి నేషనల్ యూత్ డే వేడుకలను ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలు, ఆశయాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్, ప్రతాప్, ఈరన్న శెట్టి, రఘు, మహిళా విభాగ్ అధ్యక్షురాలు సంగీత, వంకదారు మమతశ్రీ, ప్రతాప్, హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: యువతకు ఆదర్శం స్వామివివేకానంద అని ఆయన ఆశయ సాధనం కోసం యువత పాటుపడాలని యువస్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి నాగరాజులు పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవం, స్వామివివేకానంద జయంతి, యువ స్పందన సొసైటీ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా దేవాలయంలో స్వామివివేకానంద విగ్రహానికి సొసైటీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకున్న అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యువస్పందన సభ్యులు రమేష్, ఇస్మాయిల్, వెంకటరాముడు, అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం, జనవరి 12: మండలంలోని కామవరం గ్రామంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని, యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ యువకులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ యువకులు స్వామి వివేకానంద జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని అతని అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

చంద్రబాబుతోనే రైతు రాజ్యం



మద్దికెర. జనవరి 12: మాజీ సీఎం నారా చంద్రబాబుతోనే రైతు సంక్షేమం సాధ్యమని, మూడు నెలలో టీడీపీ గెలిచి రైతురాజ్యం తెస్తుందని టీడీపీ నాయకులు మూలింటి రంగస్వామి, మంగళ రంగస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికలలో టీడీపీ విజయం సాధించడం తధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల దాటినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యేలను మార్చినా టీడీపీ విజయాన్ని ఆపలేరన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం దోచుకోవాలని చూస్తోంది'

హొళగుంద, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం రూ.988 కోట్లను మంజూరు చేసిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను దోచుకోవాలని చూస్తుందని ఆదోని డివిజన్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎండీ హళ్లి సర్పంచ్ సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంపిన రూ.988 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.393 కోట్లను గ్రామపంచాయతీ పీఎఫ్ ఎంఎస్ ఖాతాల్లో జమ చేయడంపై మండిపడ్డారు. మిగిలిన రూ.595 కోట్లను గ్రామపంచాయతీ ఖాతాలకు మళ్లించాలని, లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు

వైసీపీని గద్దె దింపాలి



పెద్ద పెండేకల్లులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఆదోని రూరల్, జనవరి 12 : జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని గద్దె దింపాలని జనసేన మండల అధ్యక్షుడు తాహేర్ వలి, పులిరాజా ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దపెండేకల్లులో జనసేన ఆధ్వర్యంలో వారు పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నరు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఏడాది క్రితం గడప గడప కార్యక్రమంలో గ్రామంలో పర్యటించినా, సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. తాగునీటి సమస్య అసలు పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రామానాయుడు, గోవిందు, అయ్యప్ప పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

- మొక్కలు లేకపోతే బిల్లులు ఇవ్వం

తుగ్గలి, జనవరి 12: జాతీయ ఉపాధి హామీ పథకం కింద అవినీతికి పాల్పడితే కఠిన చర్యలతోపాటు సొమ్మును రికవరీ చేస్తామని, మొక్కలు లేకపోతే బిల్లులు చెల్లించేది లేదని పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీవో కార్యాలయం ఎదుట 2022-2023 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి, పీఆర్ పనులపై సామాజిక తనిఖీలు చేసి వాటిపై ప్రజాచర్చావేదికను నిర్వహించారు. ఏడాది పాటు 23 గ్రామ పంచాయతీల్లో రూ.26కోట్ల పనులు జరిగాయి. ప్రతి గ్రామంలో జరిగిన పనులపై సామాజిక బృందం తనిఖీ చేసిన వివరాలను చదివి వినిపించారు. ముఖ్యంగా అవెన్యూ ప్లాంటేషన్, రైతులు నాటిన మొక్కలు ఎక్కువగా చనిపోయాయని, వాటిన్నింటి స్థానంలో మొక్కలను తిరిగి నాటాలని సూచించారు. రూ.26కోట్ల పనులలో రూ.95,526 అవినీతి జరిగిందని, ఆ సొమ్ము మొత్తాన్ని వెంటనే రికవరీ కట్టాలని ఆదేశించారు. అలాగే పనులలో చేసిన తప్పిదాలకు రూ.1.29లక్షలు పెనాల్టీ చెల్లించాలన్నారు. అనంతరం డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలని, ఈ పనులలో ఎలాంటి అవినీతి జరిగినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అడిషనల్ పీడీ మాదవీలత, ఎంపీడీవో సావిత్రి, ఏపీవో రామకృష్ణ, ఈసీ ప్రదీప్‌కుమార్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖాదర్‌లింగ స్వామి జయంతి

కౌతాళం, జనవరి 12: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 404వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి సమాధిని దర్గా ధర్మకర్త పెద్ద మున్న పాషా ప్రత్యేక పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం స్వామి వారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం భక్తులతో కలసి ప్రత్యేక ఫాతెహలను నిర్వహించారు. పక్కీర్ల విన్యాసాలు ఎంతగానో ఆకర్షించాయి. టీడీపీ నాయకులు వెంకటపతిరాజు, కాశీవిశ్వనాథ, వెంకటరెడి దర్శించుకున్నారు. వీరిని దర్గా పెద్దలు సన్మానించారు.